నిర్మలమ్మకు నివేదన



- నత్తనడకన మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్
- నిధుల కొరతతో పదేళ్లుగా సాగుతున్న పనులు
- ఈసారైనా కాళేశ్వరానికి జాతీయ హోదా దక్కేనా
- సిద్దిపేటలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు విన్నపాలు
- అసంపూర్తిగా జాతీయ రహదారుల నిర్మాణం
- నేడు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- జిల్లా నుంచి ఇద్దరు బీజేపీ, ఒక కాంగ్రెస్ ఎంపీ ప్రాతినిధ్యం

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు సంబంధించిన పెండింగ్ పనులు, కొత్త ప్రాజెక్టులు, నూతన విద్యాసంస్థల ఏర్పాటు, కాళేశ్వరం జాతీయ హోదా, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌పై ఎప్పటిలాగే ఆశలు చిగురిస్తున్నాయి. కరీంనగర్ ఎంపీగా ఉన్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు జిల్లాలోని 4 మండలాలతో సంబంధం ఉంది. ఇక మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పరిధిలో జిల్లాలోని 80 శాతం విస్తీర్ణం ఉంటుంది. వీరిద్దరూ కేం ద్రంలో అధికారం నిర్వహిస్తున్న బీజేపీకి చెందినవారే. ఇక భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై జిల్లాలోని చేర్యాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే, బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు ఎలాంటి ప్రాధాన్యత దక్కుతుందో కాసేపట్లో తేలనున్నది.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 31


చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు సమీపంలో కొనసాగుతున్న కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ పనులు

కేంద్ర బడ్జెట్ అనగానే రైల్వేలైన్లు, జాతీయ రహదారులు, భారీ ప్రాజెక్టులు, జాతీయ హోదాలతో ముడిపడి ఉంటుంది. ఇందులో ఏ ఒక్కటి దక్కినా ఆ ప్రాంత స్వరూపమే మారిపోతుంది. అందుకే కేంద్ర కేటాయింపుల గురించి ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, ఎంపీలు ఎదురుచూస్తుంటారు.

నత్తనడకన రైల్వేలైన్

మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ ఏర్పాటుకు సుదీర్ఘ నిరీక్షణ అనంతరం 2016లో ప్రధాని నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. 151 కిలోమీటర్ల రైల్వేలైను నిర్మాణంలో భాగంగా సగానికి పైగానే పూర్తయ్యింది. గజ్వేల్, సిద్దిపేట రైల్వేస్టేషన్లు సైతం ప్రారంభమయ్యాయి. నిత్యం సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు రైలు నడుస్తోంది. సిద్దిపేట నుంచి సిరిసిల్ల, వేములవాడ మీదుగా కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వరకు ఈ రైల్వేలైను పూర్తికావాలంటే ఏళ్లు పట్టేలా ఉంది. కరీంనగర్ వరకు ఈ లైన్ పూర్తయితే ఈ మార్గంలో ఎక్స్‌ప్రెస్‌లు నడిచే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న సిద్దిపేట రైలుపై ప్రయాణికులు ఆసక్తి చూపించడం లేదు.

సైనిక్ స్కూల్.. రోడ్లు అవసరమే..

- జిల్లాలో ప్రస్తుతం నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. సైనిక్‌స్కూల్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. తెలంగాణలోని దాదాపు 10 జిల్లాలకు మధ్యస్థంగా ఉన్న సిద్దిపేటలో ఈ స్కూల్‌ను నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు నెలకొన్నాయి.
- భారత్ మాల కింద హుస్నాబాద్ నుంచి జనగామ జిల్లాకేంద్రం వరకు ఫోర్‌లైన్ రహదారిని నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు చేశారు. ఆ పనులను ప్రారంభించాల్సి ఉంది.
- గజ్వేల్‌లో నిర్మిస్తున్న ట్రిపుల్‌ఆర్ ఉత్తరభాగానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయింపు జరగాలి.
- మెదక్- సిద్దిపేట, సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారులను నాలుగులేన్లుగా కాకుండా చాలాచోట్ల రెండు లేన్లుగానే నిర్మించడంపై ప్రజల్లో విమర్శలు నెలకొన్నాయి. జాతీయ రహదారిని అసంపూర్తిగా నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు.
- ప్రముఖ శైవక్షేత్రమైన కొమురవెల్లి సమీపంలో రైల్వే హాల్ట్ పాయింట్ కాకుండా స్టేషన్ నిర్మించాల్సి ఉంది.

70 గ్రామాలు.. 15 స్టేషన్లు

మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల పరిధిలోని 70 గ్రామాల మీదుగా కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైను నిర్మిస్తున్నారు. ఇప్పటికే వర్గల్ మండలం నాచారం, రాయపోల్ మండలం అప్పాయిపల్లి, బేగంపేట, గజ్వేల్ మండలం కొడకండ్ల, కొండపాక మండలం దుద్దెడ, సిద్దిపేట స్టేషన్లు పూర్తయ్యాయి. గజ్వేల్‌లో ఎరువులకు సంబంధించిన రేక్ పాయింట్‌ను కూడా ఏర్పాటు చేశారు. కాగా కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను నిర్మించకుండా హాల్ట్‌స్టేషన్ నిర్మిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు 15 స్టేషన్లు ఉంటాయి. మెదక్ జిల్లాలో 9.30కిలోమీటర్లు, సిద్దిపేట జిల్లాలో 83.40కిలోమీటర్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 37.80 కిలోమీటర్లు, కరీంనగర్ జిల్లాలో 20.86 కిలోమీటర్ల దూరం ట్రాక్ నిర్మాణం ఉంటుంది. త్వరితగతిన నిధులు సమకూరితే వచ్చే రెండేళ్లలో కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు ట్రాక్ పూర్తయి రైళ్ల రాకపోకలు సాగుతాయి. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని అనుసంధానించేలా ఈ రైల్వే లైను నిర్మాణం ఉండబోతుంది.

కాళేశ్వరానికి జాతీయహోదా దక్కేనా

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో

మిగతా 6వ పేజీలో..

కొత్త మండలాల ప్రకారమే

ఎన్నికలు

- జిల్లాలో 2 ఎంపీటీసీ స్థానాలు తొలగింపు.. కొత్తగా మరో రెండు ఏర్పాటు
- ఫిబ్రవరి 3న తుది నివేదిక

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పడి మూడు మండలాల ఆధారంగానే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నది. గతంలో జిల్లాలో 23 మండలాలు ఉండగా... మూడు మండలాలు కొత్తగా ఏర్పడడంతో ఆ సంఖ్య 26కు చేరింది. జిల్లాలో కుకునూర్‌పల్లి, దూల్మిట్ట, అక్బర్‌పేట-భూంపల్లి మండలం నూతనంగా ఏర్పాటు చేశారు. గతంలో 23 జడ్పీటీసీ ఉండగా.. పెరిగిన మండలాలను కలుపుకొని జడ్పీటీసీ స్థానాలు సైతం 26కు చేరాయి.

ఫిబ్రవరి 3న తుది నివేదిక...

జిల్లాలో గతంలో 229 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అయితే తొగుట మండలంలో ముంపు గ్రామాల్లో ఉన్న ఎటిగడ్డ కిష్టాపూర్, వేములగట్టు రెండు ఎంపీటీసీ స్థానాలను తొలగించగా... మరో రెండు నూతనంగా ఏర్పడనున్నాయి. కొత్తగా ఏర్పడనున్న ఎంపీటీసీ స్థానాలపై అభ్యంతరాలను ఫిబ్రవరి 2 వరకు స్వీకరించనున్నారు. తుది జాబితాను ఫిబ్రవరి 3న వెల్లడిస్తామని జడ్పీ సీఈవో రమేష్ తెలిపారు. కొత్తగా ఏర్పడిన మండలాల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కొత్త మండలాలకు ఇన్‌చార్జులుగా ఎంపీడీవోలను నియమించారు. కుకునూర్‌పల్లి మండలానికి కొండపాక మండలంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాంప్రసాద్, దూల్మిట్ట మండలానికి నంగునూరు మండలంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్‌రావు, అక్బర్‌పేట-భూంపల్లి మండలనికి దౌల్తాబాద్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జైపాల్‌రెడ్డికి ఇన్‌చార్జులుగా బాధ్యతలను అప్పగించారు. కొత్త ఎంపీడీవో కార్యాలయాలను ప్రారంభించాల్సింది ఉండగా... ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో వాయిదా పడ్డాయి.

ముగిసిన ముర్షిద్‌గడ్డ ఉర్సు


ముగింపు సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ముర్షిద్‌గడ్డ దర్గా ఉర్సు శుక్రవారం ముగిసింది. మూడు రోజులపాటు కొనసాగిన ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో మూడవరోజు ఖత్మే ఖురాన్‌లో అమృత ఖవ్వాలి, అన్నదానం ఏర్పాటు చేశారు. ఖురాన్ పఠనం చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతులు ఖాజా మహ్మద్ హకీమ్ షరీఫ్ చిష్తి, సయ్యద్ ముక్తార్ హుస్సేని, ఫుర్ఖాన్ హష్మీ, ఏజాజ్ పటేల్, యూనుస్ పటేల్, మహమూద్ ఖాజా, మహమూద్ సాబెర్ షరీఫ్ (ఇల్యాస్ బాబా) తదితరులు పాల్గొన్నారు. కాగా ముర్షిద్‌గడ్డ దర్గా ఉర్సుకు కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ హాజరయ్యారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వహిద్‌ఖాన్, అత్తు ఇమామ్, కలీమొద్దీన్, వహాబ్, షాహ్బాజ్ ఖాన్ పాల్గొన్నారు.

---

15 రోజులు.. రూ.58.47లక్షలు

మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపులు



చేర్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం కానుకలు, ఒడిబియ్యం హుండీ లెక్కింపులు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో ఆలయ ముఖ మండపంలో శివరామకృష్ణ భజనమండలి సమితి సభ్యులు కరెన్సీ లెక్కించారు. రూ.58,47,941 నగదు, 31 గ్రాములు బంగారం, 6కిలోల వెండి, 24 విదేశీ కరెన్సీ నోట్లు, 11 క్వింటాళ్ల ఒడిబియ్యం లభ్యమయ్యాయి. ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల పట్నం, లష్కర్ వారాల జాతర పూర్తవగా, వేలాదిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణం అనంతరం లష్కర్ వారానికి ముందు ముందు హుండీలు లెక్కించగా, ఈ ఆదాయం కేవలం 15రోజులలోనే సమకూరింది. కార్యక్రమంలో ధర్మకర్తలు కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, మామిడాల లక్ష్మి, అల్లం శ్రీను, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన ఇస్రో రిటైర్డ్ ఇంజనీర్ డి.కుమారస్వామి రూ.1,00,116నగదు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీను, ప్రధానార్చకుడు మహ దేవుని మల్లికార్జున్, ధర్మకర్త జయప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

నాచగిరిలో లక్ష పుష్పార్చణ

వర్గల్: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం శుక్రవారం మాఘమాసం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఉదయం విశేష అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి దాతలు అల్లం కృష్ణమూర్తి సుకన్య దంపతుల ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. ప్రత్యేకమాసం సందర్భంగా స్వామి వారి దర్శనం కోసం భక్తులు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లలో బారులు తీరారు.


లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

సిద్దిపేటరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి); సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండపై శుక్రవారం స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం మంత్రోచ్చరణాలతో వైభవంగా జరిగింది. క్షేత్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. ఉదయం సుప్రభా సేవ కార్యక్రమంతో లక్ష్మీనరసింహస్వామి వారికి తులసీ అర్చన, మహాకుంభారాధన, సుదర్శన నరసింహ హవనం చేపట్టారు. మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుల్లురు కనకయ్యగౌడ్, వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగచారి, శ్రీనివాసచార్యులు, వెంకట నరిసింహచార్యులు, రామకృష్ణ చార్యులు, పుల్లూరు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్ వైపు

అడుగులు

- భూముల సర్వే పూర్తి
- ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం


అక్కన్నపేట మండలం చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు గుర్తించిన భూములు

అక్కన్నపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలు కల్పించడానికి అక్కన్నపేట మండలం చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. పార్కుకు అవసరమైన భూసేకరణ సర్వే పూర్తయింది. ప్రభుత్వం భూములు సేకరించేందు కు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ భూములకు సంబంధించి సర్వేనంబర్లు, పట్టాదారులు, అనుభవదారులు, వ్యవసాయ బావులు, బోర్లు, చెట్లు, నిర్మించిన పెద్దమ్మ ఆలయం, నిర్మించబోయే ఎల్లమ్మఆలయంతో కూడిన తదితర వివరాలను నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే 60 రోజుల్లో తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో రామ్మూర్తి కోరారు.

124.36 ఎకరాల భూమి సేకరణ..

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 124.36 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన సర్వేను అధికారులు పూర్తిచేశారు. చౌటపల్లిలో సర్వేనెంబర్ 312లో, జనగామలో సర్వే నెంబర్లు 76, 77, 78, 79లో 15.20 ఎకరాలు, హుస్నాబాద్ మండలం తోటపల్లిలో సర్వే నెంబర్లు 478,479,480,481లో 25.20 ఎకరాలు, మొత్తం 124.36 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం సర్వే పూర్తయింది.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు

కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పటు చేసే విధంగా ఇండస్ట్రియల్ పార్కులో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, పత్తి, కంది, బబ్బెర, పెసర లాంటి పంటలు ఎక్కువగా పండిస్తుండడంతో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. హుస్నాబాద్ నుంచి జనగామ జిల్లాకేంద్రానికి ఫోర్‌లేన్ విస్తరించనుండడంతో జాతీయ రహదారిగా రవాణా మెరుగుపడుతుంది. అందుకోసమే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు మొగ్గుచూపుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి పొన్నం ప్రభాకర్

ఇండస్ట్రియల్‌పార్కు ఏర్పాటుపై మంత్రి పొన్నం ప్రత్యేక దృష్టి పెట్టారు. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నారు. భూములు ఇస్తున్న రైతులకు ప్రభుత్వం నుంచి న్యాయమైన పరిహారం అందజేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఇండస్ట్రియల్ పార్కుకు సంబంధించి ప్రభు త్వం నుంచి అనుమతులు కూడా లభించినట్లు సమాచారం.

ప్రకృతి ఒడిలో అనంతసాగర్

సరస్వతీ క్షేత్రం

- వీణాపాణియై కొలువైన అమ్మవారు
- రేపటి నుంచి మూడురోజుల పాటు బ్రహ్మోత్సవాలు

5

యోగాతో శరీర రుగ్మతలు..

ధ్యానంతో ఒత్తిడి మాయం

- స్వామి పరమార్ధదేవ్
- ఐఐటీహెచ్‌లో యోగా, ధ్యాన సాధనలపై ప్రత్యేక శిబిరం

5

ఉచిత శిక్షణతో

ఉపాధికి బాట

- అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ

6

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి : సీపీ

సిద్దిపేట క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా పోలీసు అధికారులకు సీపీ డాక్టర్ బి.అనురాధ సూచించారు. శుక్రవారం సీపీ అనురాధ పలు కార్యక్రమాలు, సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ నియమనిబంధనలు పకడ్బందీగా అమలు పరచాలన్నారు. చోరీల నివారణకు పెట్రోలింగ్ నిర్వహించాలని, సిబ్బంది నిరంతరం విధులు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ మత్తుపదార్థాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కారక్యక్రమాలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. అలాగే ఆమె జిల్లాలో ఉన్న రౌడీలు, కేడీలు, అనుమానాస్పద వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఈసందర్భంగా వారితో ప్రతిజ్ఞ చేయించారు.

ఉద్యోగ విరమణ వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదు

పోలీస్ ఉద్యోగ విరమణ వృత్తికే కానీ వ్యక్తిత్వాన్ని కాదని సీపీ అన్నారు. సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ తోట రవీందర్ ఉద్యోగ విరమణ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో ఆయనను సన్మానించి మాట్లాడారు. అలాగే ఆయనకు విధి నిర్వహణ ఎదురైన అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.



పలువురికి సేవా పతకాలు

జిల్లా నుంచి ముగ్గురు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్కృష్ట సేవా పతకాలు, ఎనిమిది మంది అతి ఉత్కృష్ట సేవా పతకాలు పొందారు. వారిని సీపీ అనురాధ శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో అభినందించారు. కొండపోచమ్మసాగర్‌లో నీటిలో మునిగి చనిపోయిన వ్యక్తుల మృతదేహాలను త్వరగా బయటకు తెచ్చి గజ ఈతగాళ్లు కొడంగల్ యాదగిరి, తుడంగల్ కృష్ణ, తుడంగల్ నాగరాజు, రాజు మహేష్‌ను సీపీ అభినందించి నగదు పురస్కారం అందజేశారు.

జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన

యానిమల్ వెల్ఫేర్ ఫోర్ట్ నైట్ సెలబ్రేషన్‌లో భాగంగా కమిషనర్ కార్యాలయంలో వెటర్నరీ డాక్టర్ల బృందం జంతు సంరక్షణ చట్టాల గురించి పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏ ఏహెచ్‌వో డాక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడారు. జంతు సంరక్షణ, యానిమల్ ప్రొటెక్షన్‌పై కేంద్ర, రాష్ట్ర, జిల్లాస్థాయిలో ప్రత్యేక బోర్డ్ ఉన్నాయని తెలిపారు. యానిమల్స్ బతకడానికి కావలసిన సౌకర్యాలు, రక్షణ చట్టాలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం సీపీ మాట్లాడారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతి వారం జరిగే సంతలలో పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ డిపార్ట్‌మెంట్ అధికారులు పోలీసులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం

సిద్దిపేటఅర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నేరస్థునికి 20 ఏళ్ల పాటు జైలు శిక్ష పడడంతో కీలకపాత్ర పోషించిన పోలీస్ అధికారులను శుక్రవారం సీపీ అనురాధ ఘనంగా సన్మానించి సరిఫికెట్లను అందజేశారు. కేసుల్లో శిక్షల శాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపి మధు, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్ లింగం, ఎస్బి ఇన్‌స్పెక్టర్ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేపటి నుంచి పోచమ్మ ఆలయ దశమ వార్షికోత్సవాలు

కొండాపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : తొగర్‌పల్లిలో సప్తముఖి పోచమ్మదేవి ఆలయ దశమ వార్షికోత్సవాలను 2, 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ప్రసాద్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. మూడు రోజుల పాటు విశేష పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెదక్‌కు రెండో స్థానం

మొదటిస్థానంలో నిలిచిన నిజామాబాద్



ప్రథమస్థానంలో నిలిచిన నిజామాబాద్ బాలుర జట్టు

తూప్రాన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు విజయం సాధించగా, మెదక్ రెండో స్థానంలో నిలిచింది. మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూప్రాన్ పట్టణంలో అండర్ 14 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు, జట్ల ఎంపిక చేపట్టారు. శుక్రవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. బాలుర విభాగం పోటీల్లో మెదక్, నిజామాబాద్ తలపడగా నిజామాబాద్ 5-6 తేడాతో విజయం సాధించింది. మెదక్ ద్వితీయస్థానం, మహబూబ్‌నగర్ తృతీయస్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు మండల విద్యాధికారి డాక్టర్ పర్వతి సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ గంగాల, టోర్నమెంట్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్‌శర్మ, గోవర్ధన్, రాష్ట్ర పరిశీలకులు గంగా మోహన్, రవికుమార్, పిజికల్ డైరెక్టర్లు చంద్రమోహన్, పద్మ, మాలతి, లతీఫాఉన్నీసా, మంజుల, సరోజినీ, శంకర్, మధు, కిరణ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. క్రీడల్లో ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ సాకుతో
రైతు భరోసా నిలిపేస్తే సహించం

● మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్

సంగారెడ్డి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకుతో రైతు భరోసా నిలిపేస్తే సహించేది లేదని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంగారెడ్డిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జనవరి 26 నుంచి రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి కొందరికి మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేసి హామీని నిలబెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో రైతులను ఏకం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగ విరమణ చేసిన రోజే
ప్రయాస్ ప్రయోజనాలు

● పీఎఫ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



పీఎఫ్ పత్రాలను అందజేస్తున్న అధికారులు

పటాన్‌చెరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన రోజే ప్రయాస్ పథకం ద్వారా పీఎఫ్ ప్రయోజనాలు, పెన్షన్ పత్రాలను అందజేస్తున్నామని పటాన్‌చెరు పీఎఫ్ కమిషనర్ శ్రీదేవి పేర్కొన్నారు. జనవరి నెలాఖరును ఉద్యోగ విరమణ చేసిన 42 మందికి శుక్రవారం పీఎఫ్ సెటిల్‌మెంట్, పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రయాస్ కార్యక్రమంలో భాగంగా పదవీ విమరణ చేసిన రోజే వారికి రావాల్సిన పీఎఫ్ తుది బకాయిలను, ఇతర ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ దిలీప్‌మీన, అకౌంట్ ఆఫీసర్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. డీలర్ల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని హైదరబాద్‌లోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం మంత్రి డీలర్ల సంఘం సలహాదారుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. సంక్షేమ పథకాల అమలులో డీలర్లకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, సంగారెడ్డి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌రావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మతల్లి
ప్రతిష్ఠాపన మహోత్సవం

పెద్దశంకరంపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదబ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛరణల మధ్య యంత్ర విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఖేడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్ షెట్కార్, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచు అలుగుల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, నాయకులు గ్రామ పెద్దలు మురళీపంతులు, సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, సంతోష్‌కుమార్, సుభాష్‌గౌడ్, గంగారెడ్డి, దత్తు ఆలయ కమిటీ బాధ్యులు ఫణికుమార్, మల్లేశం, సుభాష్, హరిప్రసాద్‌గౌడ్, సాయిలు, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేను అడ్డుకున్న రైతులు

● కామారంలో అధికారులు, పోలీసుల సమక్షంలో సర్వే
● బాధిత రైతుల ఆందోళన



అధికారితో మొర పెట్టుకుంటున్న రైతులు

చిన్నశంకరంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దౌర్జన్యంగా భూములు లాక్కోవాలని చూస్తే సహించబోమని చిన్నశంకరంపేట మండలంలోని కామారం రైతులు హెచ్చరించారు. పైఅధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్, ఎస్ఐ నారాయణగౌడ్, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో కామారంలోని ప్రైవేటు భూమిని సర్వే చేస్తుండగా బాధత రైతులు ఆందోళన సృష్టించడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. సర్వేను అడ్డుకుని ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు హెచ్చరించారు. తమ భూమిని ఎలా సర్వే చేయిస్తారని, తమ భూమిని విక్రయించినట్లు ఆధారాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఫోర్జరీ సంతకాలు సృష్టించి భూమిని లాక్కోవాలని చూస్తున్నారని రైతులు ఆరోపించారు. బాధిత రైతులకు న్యాయం చేస్తామని అధికారులు సముదాయించారు.

















క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మద్దెల రాములు (ఫైల్)

కౌడిపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం కౌడిపల్లి పరిధిలోని హైవే765డిపై చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన మద్దెల రాములు(50) వ్యవసాయం పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి తన మోటార్‌సైకిల్‌పై పొలానికి బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి 765డిపై నర్సాపూర్ వైపు నుంచి మెదక్‌కు అతి వేగంగా అజాగ్రత్తతో వస్తున్న బొలేరో వాహనం మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నది. రాములు తలకు బలమైన గాయం కాగా, చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. రాములు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, బైక్ ఢీకొని మరొకరు..


కండ్లపల్లి ప్రభాకర్ (ఫైల్)

హత్నూర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులో సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. హత్నూర మండలంలోని సాదుల్లానగర్ గ్రామానికి చెందిన కండ్లపల్లి ప్రభాకర్(25) సంగారెడ్డి నుంచి తన బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. గుండ్లమాచునూర్ బస్టేజీ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందగా.. ఆటోలో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ రహదారిపై కారు పల్టీ

- ఇద్దరికి తీవ్రగాయాలు.. సరాఫ్‌పల్లి వద్ద ఘటన


రహదారిపై పక్కకు ఒరిగిన కారు

పుల్‌కల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి వద్ద సంగారెడ్డి - నాందేడ్ - అకోలా 161 జాతీయరహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన గణేష్(25), మహానంద(23) మారుతి రిట్జ్ కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు సరాఫ్‌పల్లి ఫ్లైఓవర్‌పై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనలో గణేష్, మహానంద తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న జాతీయ రహదారి పెట్రోలింగ్, అంబులెన్స్ సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. జాతీయరహదారిపై పల్టీకొట్టిన కారును సిబ్బంది క్రేన్ సహాయంతో తొలగించారు. ఈ మేరకు పుల్కల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యం బాధతో రైతు ఆత్మహత్య

మద్దూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మద్దూరు మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి రేబర్తి గ్రామానికి చెందిన నలుసాని రాజిరెడ్డి(45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చూపించుకుంటూ చికిత్స తీసుకుంటున్నా వ్యాధి నయం కాకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోంచి పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజిరెడ్డి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాజిరెడ్డికి ఇద్దరు కుమారులున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

చెరువులో దూకిన యువకుడు

- గాలింపు చేపట్టినా లభించని మృతదేహం

నర్సాపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకోగా, ఇంకా మృతదేహం లభ్యం కాలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన నూనె రాకేష్(32), తన భార్య శారదకు తరచూ గొడవలు జరుగుతుండటంతో భరించలేక భార్య పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు ఈ విషయంలో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. సఖీ సెంటర్‌లో కూడా కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా భార్య కాపురానికి రావడానికి నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన రాకేష్ గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి నర్సాపూర్ సమీపంలోని రాయరావు చెరువులో దూకాడు. వాచ్‌మన్ గమనించి పోలీసులకు, కుటుంబీకులకు సమాచారమిచ్చారు. శుక్రవారం ఉదయం పోలీసులతో పాటు ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సాయంత్రం 6.30 వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. అయితే సాయంత్రం చీకటిపడటంతో వెతకడం కష్టం కావడంతో గాలింపు నిలిపివేసి శనివారం తిరిగి వెతుకనున్నట్లు పోలీసులు చెప్పారు.

చిరుతపులి కళేబరం దహనం

చేగుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిరుతపులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు. మెదక్ జిల్లా అటవీ అధికారి(డీఎఫ్‌వో) జోజి వెల్లడించిన వివరాల ప్రకారం.. నార్సింగి మండలం వల్లూరు అటవీ ప్రాంతంలోని జాతీయరహదారి 44 వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిరుతపులి మృతిచెందిన విషయం తెలిసింది. చిరుత కళేబరానికి వల్లూరు నర్సరీలో వెటర్నరీ వైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించారు. ఎన్టీసీఏ ప్రొటోకాల్ ప్రకారం అటవీ ప్రాంతంలోనే చిరుతపులి కళేబరాన్ని దహనం చేశారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరుగకుండా అటవీ ప్రాంతం నుంచి వెళ్లే జాతీయరహదారులకు ఇరువైపులా అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు నివేదికలు పంపుతున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు. అటవీ ప్రాంత రహదారులకు ఇరువైపులా జంతు సంచారానికి సంబంధించిన ఫొటోలు ఏర్పాటు చేయాలని కోరుతామన్నారు. రామాయంపేట రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్, నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహియుద్దీన్, వెటర్నరీ వైద్యాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


దహనం చేస్తున్న చిరుత కళేబరం

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

త్రిదండి చినజీయర్‌స్వామి ప్రవచనం



రామాయంపేటలో అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్‌స్వామి

చేగుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగిఉండాలని, ఆలయాల అభివృద్ధి కోసం, హిందూ ధర్మం కోసం పాటుపడాలని త్రిదండి చినజీయర్‌స్వామి సూచించారు. చేగుంట మండల కేంద్రంలోని పద్మావతి గోదా సమేత కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భారతదేశంలో అన్ని జాతులు సమానంగా చూసిన వారు రామానుజుల వారు మాత్రమేనని అంబేడ్కర్ 1927 జూన్ 3న ఓ పత్రికా ఎడిటోరియల్‌లో ఈ సందేశాని రాసినట్టు పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రి మోదీ కుడా ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ సమయంలో వచ్చిన తాను మళ్లీ 42 సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చానని చెప్పారు. ఆలయం అలాగే ఉంది కానీ, ఊరు మాత్రం బాగా అభివృద్ధి చెందిందని చమత్కరించారు. ఈ కార్యక్రమంలో వంశపారపర్య ధర్మకర్త బచ్చు సుదర్శన్‌రావు, బచ్చు శేఖర్, పూజారి వైద్య వాసుదేవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ధర్మాన్ని ఆచరిస్తేనే వర్తమానం

రామాయంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ధర్మాన్ని ఆచరిస్తేనే వర్తమానమని, భక్తి ఔదార్యమే సమాజానికి రక్షా కవచమని త్రిదండి చినజీయర్‌స్వామి తెలిపారు. రామాయంపేటలో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన విచ్చేశారు. ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన సభ వేదికపైకి చేరుకుని అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్, పాలకమండలి, భక్తుల పాల్గొన్నారు.

మరకత రాజరాజేశ్వరస్వామికి హంపీ పీఠాధిపతి పూజలు


పూజలు నిర్వహిస్తున్న విద్యారణ్య మహాస్వామి

తూప్రాన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): యావాపూర్‌లోని శ్రీమరకత రాజరాజేశ్వరస్వామి శివ పంచాయతన సహిత గణపతి, ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూజారి దత్తుశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరస్వామికి విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించారు. హంపీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య మహాస్వామి విచ్చేయగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విద్యారణ్యస్వామి రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు.

ప్రకృతి ఒడిలో అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం

వీణాపాణియై కొలువైన అమ్మవారు

రేపటి నుంచి మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

చిన్నకోడూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ ఎత్తైన కొండలు, దట్టమైన అడవి, పచ్చని చెట్లు, పక్కనే చెరువుతో ప్రశాంతమైన వాతావరణంలో చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామ శివారులో వీణాపాణియైన దేశంలోనే మొదటి సరస్వతీ క్షేత్రంగా విరాజిల్లుతూ భక్తుల పూజలందుకుంటుంది. అనంతసాగర్ సరస్వతీ క్షేత్రంలో ప్రతీ సంవత్సరం వసంత పంచమిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

దోనెలలో నీరు పవిత్రం

పూర్వం ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన దోనెలు అనే పేరుతో ఎనిమిది నీటి గుహలు అష్టతీర్థములుగా ఉండేవి. ప్రకృతి వైపరీత్యంలో ఐదు కూలిపోగా ప్రస్తుతం రాగిదోనె, చీకటిదోనె, పాలదోనె మాత్రం మిగిలి ఉన్నాయి. ఎల్లప్పుడు ఈ దోనెలలో నీరుండటం విశేషం. ఈ దోనెలలోని నీటితో స్నానాలు చేస్తే దీర్ఘ రోగాలు పోతాయని, మాటలు రాని చిన్న పిల్లలకు మాటలు వస్తాయని, అదేవిధంగా ఈ గుహలలోని నీటిని తీసుకెళ్లి పంటలపై చల్లితే చీడ, పీడలు తొలగునని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నీటి గుహల సమీపంలోనే సిద్దిపేట పట్టణానికి చెందిన అష్టావధాని అష్టకాల నరసింహరామశర్మ 1980 మే 2 న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పదేళ్ల పాటు శ్రమించి ఆలయాన్ని పూర్తి చేశారు. 1990లో ఆలయంలో నిలుచునియున్న సరస్వతీ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి సరస్వతీ అమ్మవారికి నిత్య పూజలు జరుగుతున్నాయి. రేపటి నుంచి మూడు రోజుల ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో 35వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ క్షేత్రం అక్షరాభ్యాసాలకు నిలయంగా మారింది. ప్రతీ ఏటా వసంత పంచమి రోజున సామూహిక అక్షరభ్యాసాలు చేయిస్తారు. వసంత పంచమి రోజున భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతాయి.


ఆలయంలోని వీణాపాణి సరస్వతీ అమ్మవారు


అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం రాజగోపురం


ఐఐటీహెచ్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

యోగాతో శరీర రుగ్మతలు.. ధ్యానంతో ఒత్తిడి మాయం

స్వామి పరమార్థదేవ్

ఐఐటీహెచ్‌లో యోగా, ధ్యాన సాధనపై ప్రత్యేక శిబిరం


ఆసనం నేర్పుతున్న పరమార్థదేవ్

కంది, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా శరీర రుగ్మతలను.. ధ్యానం చేయడంతో ఒత్తిడి మాయమవుతుందని స్వామిపరమార్థదేవ్ అన్నారు. కంది పరిధిలోని ఐఐటీ హైదారాబాద్‌లో శుక్రవారం డైరెక్టర్ బీఎస్ మూర్తి యోగా, ధ్యాన సాధనలపై ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామ్‌దేవ్ బాబా శిష్యుడు శ్రీస్వామి పరమార్థదేవ్ జ్యోతి ప్రజ్వలన చేసి అగ్నిహోత్రం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులకు వివిధ రకాల యోగాసనాలు, ప్రాణాయామం, శ్వాసపై ధ్యాన, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, సమగ్ర శ్రేయస్సుల పురోగతికి యోగ, ధ్యానం ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానసాధనలు ప్రతీ ఒక్కరికి నిత్యావసరమైన అంశాలన్నారు. ఆధునిక సమాజంలో సంపాదన కొందరికే ఉన్నా అనారోగ్యం అందరికీ ఉందని పేర్కొన్నారు. విపరీతమైన ఆలోచనలు, అధిక ఒత్తిడి దీర్ఘకాలిక రోగాలకు కారణమవుతుందని వివరించారు. ప్రస్తుత రోజుల్లో చాలా మందికి బీపీ, షుగర్‌లు ఎక్కువగా వస్తున్నాయని, వీటికి మందులు వాడితే సైడ్‌ఎఫెక్ట్ వస్తున్నాయని తెలిపారు. యోగా, ప్రాణాయామం సాధన ద్వారా పైసా ఖర్చు లేకుండా సైడ్‌ఎఫెక్ట్‌లను నివారించడంతో పాటు అనేక రుగ్మతలు రాకుండా చూసుకోవచ్చని పేర్కొన్నారు. యోగా శరీరాన్ని ధృడంగా చేస్తే, ధ్యానం మనస్సును శుద్ధి చేస్తుందని ఆయన హితవు పలికారు. విద్యార్థులు యోగా, ధ్యాన సాధనలతో ఏకాగ్రతను పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. భారత్ స్వాభిమాన ట్రస్ట్ పతంజలి యోగా సమితి శిక్షణ పొందిన కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఉచితంగా యోగాశిక్షణలు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, భారత్ స్వాభిమాన ట్రస్ట్ పతంజలి యోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీధర్‌రావు, డీన్ ప్రొఫెసర్ ప్రేమ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ పట్టణంలో పురాతన శిల్పాలు

- పరిశీలించిన చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్

మెదక్ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణంలోని ఆర్డీవో ఆఫీసు ఆవరణలో మర్రిచెట్టు కింద పురాతన శిల్పాలు, వీరగల్లు శిల్పాలు ఉన్నట్టు తెలుసుకున్న ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఒక వీరనారి కత్తి పట్టుకుని ఉన్న శిల్పం, కత్తిడాలు పట్టుకున్న వీరుడు రాతిపై చెక్కిన స్మారక శిలారూపాలు, వీరగల్లు శిల్పాలు కనిపించాయన్నారు. నవాబ్‌పేటలోనూ ఓ పురాతన వీరగల్లు శిల్పం ఉందన్నారు. తమ ప్రాంతం కోసం జరిగిన యుద్ధాల్లో వీరమరణం పొందినవారిని.. గ్రామాలను రక్షించేందుకు ప్రాణత్యాగం చేసిన వారిని ఆరాధించడం స్మరించుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయమన్నారు. అందులో భాగంగానే విగ్రహాలను చెక్కి ఉంటారని, ఇక్కడే కాకుండా అలాంటి గుర్తులు చాలా గ్రామాల్లో కొలువై ఉన్నాయన్నారు. చరిత్రకు సాక్ష్యాలైన ఈ విగ్రహాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.


చరిత్ర పరిశోధకుడు గుర్తించిన శిల్పం

వైభవంగా ఆత్మార్పణ కార్యక్రమం

సంగారెడ్డి అర్బన్/సదాశివపేట/నారాయణఖేడ్/చేగుంట/పెద్దశంకరంపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ దినాన్ని శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాలో వైభవంగా నిర్వహించారు. సంగారెడ్డి శివారులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాన్ని, అనంతరం హోమంను నిర్వహించి, అమ్మవారి పల్లకీ సేవను చేపట్టారు. సదాశివపేటలోని వాసవిమాత ఆలయంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు కోడూరి అంజయ్య, అధ్యక్షుడు అమ్మల సాయిరాజ్ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఆలయ ఆవరణలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. చేగుంట మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో కుంకుమార్చన, లలితాపారాయణం, ప్రత్యేక పూజలు చేశారు. పెద్దశంకరంపేటలో స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.


సంగారెడ్డిలోని వాసవీమాత ఆలయంలో హోమం నిర్వహిస్తున్న చైర్మన్ తోపాజి అనంతకిషన్


శేఖాపూర్‌తండాలో నిర్వహించిన పాతపంటల జాతరలో డీడీఎస్ మహిళా రైతులు చిందులు

పాతపంటల సాగు అత్యవసరం

డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త రమేష్

జహీరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మన ఆరోగ్యాలను మనమే కాపాడుకోవాలంటే పాతపంటల సాగు అత్యవసరమని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త రమేష్ తెలిపారు. డీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాతపంటల జాతరను శుక్రవారంతో 16వ రోజుకు చేరుకున్నది. జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్‌తండా, జములైతండాలో కొనసాగింది. ఈ సందర్భంగా డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగ, ప్రజల ఆహారపు అలవాట్లు మారిన నేపథ్యంలో చిరుధాన్యాలకు, వాటి ఉత్పత్తులకు మార్కెట్‌లో మరింత డిమాండ్ ఉందన్నారు. చిరుధాన్యాల సాగుకు డీడీఎస్ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్, మహిళలు, తండావాసులు పాల్గొన్నారు.

మూడో రోజూ కూడవెల్లి జాతర..

సిద్దిపేట, జనవరి31(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయం జాతర మూడవరోజైన శుక్రవారం సందడిగా సాగింది. జాతరకు బారీ ఎత్తున జనాలు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పాలకమండలి సభ్యులు రాజిరెడ్డి తోపాటు పలువురు వారికి స్వాగతం పలికారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, దుబ్బాక ఎస్ఐ గంగరాజు, భూంపల్లి ఎస్ఐ హరికృష్ణ గౌడ్ బందోబస్తు నిర్వహించారు.

నాచారంలో భక్తిశ్రద్ధలతో 'వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణం'

వర్గల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రం పరిధిలోని శ్రీవాసవీకన్యకా పరమేశ్వరీ నిత్యాన్నదాన సత్రంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వర్గల్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు బ్రహ్మాండ్లపల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు పెద్ది విశ్వనాథం, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నర్సారెడ్డి

గజ్వేల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలసి గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పలు అంశాలపై చర్చించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన లింగగారి వెంకట్‌గౌడ్‌కు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం రూ.60వేల విలువ చేసే చెక్కును తూంకుంట నర్సారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు జంగం రమేశ్‌గౌడ్, నక్క రాములుగౌడ్, వెంకట్‌గౌడ్, నాంపల్లి బాబు తదితరులున్నారు.

అధికారం కోల్పోవడంతో కేసీఆర్‌కు మతి భ్రమించింది: కాంగ్రెస్

గజ్వేల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోవడంతో కేసీఆర్‌కు మతిభ్రమించిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జంగం రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లపాటు అధికారంలో ఉండి ఒక్కసారిగా అధికారం కోల్పోవడంతో కేసీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాపాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, కేవలం ఏడాది వ్యవధిలోనే 50వేల ఉద్యోగాలు, రూ.21వేల కోట్ల రుణాల మాఫీ తదితర సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం సొంతమన్నారు. ఇది సహించలేని బీఆర్ఎస్ నాయకులు పెయిడ్ బ్యాచ్‌తో ఓట్లు వేయించి తమనే ప్రజలు కోరుకుంటున్నారని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు.

పని భారం తగ్గించాలి

- పంచాయతీ కార్యదర్శుల విజ్ఞప్తి

నంగునూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో భాగంగా పంచాయతీ కార్మికులపై పెరుగుతున్న పని బారాన్ని తగ్గించాలని ఎంపీడీవో లక్ష్మప్పకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నాలుగు పథకములకు సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులు, అనర్హుల నిర్ణయించే ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులను మాత్రమే బాధ్యులను చేయడం సరికాదన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలులో భాగంగా అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రజా పాలనపథకాల అమలులో అర్హుల ఎంపిక ప్రక్రియ నుంచి పంచాయతీ కార్యదర్శులను మినహాయింపు ఇవ్వలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వి.చంద్రకళ, గౌసొద్దీన్, రవీందర్,సురేశ్ రెడ్డి,దేవేందర్, అర్షద్, సౌమ్య, కృష్ణవేణి, సృజన, లలిత, పద్మ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

గజ్వేల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ పోరాట చరిత్ర గొప్పదని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు వద్ద మడేలయ్య చౌరస్తాలో సాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు.

ఉచిత శిక్షణతో ఉపాధికి బాట

- అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ
- శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేత
- మండల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యక్తిగత రుణాలు పొందే అవకాశం
- ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం



మద్దూరు, నర్సాయపల్లి గ్రామాల్లో టైలరింగ్, మగ్గంవర్క్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

మద్దూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ డిజైనింగ్ రంగం పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తున్నది. పేద, మధ్య తరగతి మహిళల ఆర్థికాభివృద్ధికి జిల్లా కేంద్రంలోని 'అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్' ఆధ్వర్యంలో జిల్లాలోని ములుగు, వర్గల్, మర్కుక్, గజ్వేల్, రాయ్‌పోల్, దౌల్తాబాద్, చేర్యాలతో పాటు మద్దూరు మండలాల్లోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, మగ్గంవర్క్, బ్యూటీషియన్ కోర్సుల ద్వారా స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నారు. గ్రామీణప్రాంత మహిళలకు అందిస్తున్న ఈ ఉచిత శిక్షణ వారి ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడనున్నది.

ఒక్కో బ్యాచ్‌లో 20మందికి శిక్షణ

మండల కేంద్రంలోని మండల జాగృతి సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామాల్లోని సీఏల సహకారంతో ఉచిత శిక్షణాకేంద్రాలను ఏర్పాటు చేస్తూ స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తున్నారు. 20 మంది మహిళలకు ఒక్కో బ్యాచ్ చొప్పున ఏర్పాటు చేస్తూ శిక్షకురాలిని ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తున్నారు. నెల రోజుల వ్యవధితో అందించే ఈ శిక్షణలో కుట్టుపని, కటింగ్‌తో పాటు మగ్గంవర్క్ డిజైన్ తయారీపై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల ప్రదానం చేస్తున్నారు.

ప్రభుత్వంపరంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫామ్స్‌తో పాటు ఏ ఇతర పనులు వచ్చినా వారికే మొదటి ప్రాధాన్యతనివ్వడం గమనార్హం.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి



స్వయం ఉపాధి పొందవచ్చనే ఉద్దేశంతో టైలరింగ్‌ను పట్టుదలతో నేర్చుకుంటున్నా. శిక్షణ పూర్తయిన అనంతరం సొంతంగా టైలరింగ్‌షాపు నిర్వహిస్తా. దీంతో కుటుంబ అవసరాలకు ఆసరాగా ఉండవచ్చని బావిస్తున్నా.

-భార్గవి మద్దూరు

రోజుకు 4 గంటల శిక్షణ



ఆర్గనైజేషన్ వారు అందించిన రోజువారి జాబితా ప్రకారం మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. రోజూ 4 గంటలు సమయం కేటాయిస్తూ వ్యక్తి గతంగా వారి నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటాము. నెలరోజుల్లో సంపూర్ణంగా నేర్చుకునే విధంగా శిక్షణ అందిస్తున్నాం.

-ఆర్. జ్యోతి టైలరింగ్ శిక్షకురాలు

ప్రతీ గ్రామంలో ఉచిత శిక్షణ



గ్రామాల్లో స్వయం ఉపాధి ద్వారా జీనోపాధి పొందే ఔత్సాహిక మహిళలకు అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అండగా నిలుస్తుంది. ప్రతీ గ్రామంలో మహిళా సంఘాల సీఏల సహకారంతో ఉచిత టైలరింగ్, మగ్గం వర్క్‌తో పాటు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నాం. శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్‌తో పాటు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యక్తి గత రుణాలు అందిస్తున్నాం. ఆసక్తి గల మహిళలు స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది.

- పి. రజితారెడ్డి, అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్

రూ.26 కోట్లు మంజూరైతే..
రూ.10 కోట్లతోనే సరిపెట్టుకోమంటారా?



అధికారులతో సమీక్షలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

సిద్దిపేట, జనవరి313(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రోడ్ల మరమ్మతుల కోసం మంజూరైన రూ.26 కోట్ల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసి, కేవలం రూ.10 కోట్లతోనే సరిపెట్టుకోవాలంటూ విడుదల చేయడం దారుణమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు కేటాయించాల్సిన నిధులను ఇప్పటివరకు మంజూరు చేయలేని దుస్థితిలో ఉందని అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. దుబ్బాక నియోజక వర్గానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 కోట్లపై అధికారులతో సమీక్ష జరిపారు. తమ ప్రభుత్వం హయాంలో 14 రోడ్లకు రూ.26 కోట్ల నిధులు మంజూరైతే వాటిని రద్దు చేసి, కేవలం 5 రోడ్లకే నిధులను మంజూరు చేయడం దారుణమన్నారు.

నిర్మలమ్మకు నివేదన

(3వ పేజీ తరువాయి..)

అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లను నిర్మించారు. ఈ రిజర్వాయర్ల నిర్మాణంలో భాగంగా దాదాపు 20 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వేలాది మంది నిర్వాసితులయ్యారు. పలుచోట్ల ప్రభుత్వం నుండి ఆశించిన స్థాయిలో పరిహారం, నివాస స్థలాలు, కాలనీల ఏర్పాటుతో సంతృప్తిపరిచారు. అయినప్పటికీ నిత్యం నిర్వాసితుల ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. నిధుల కొరతతోనే నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పిస్తే కేంద్రం నుంచి కూడా నిధు ల కేటాయింపు జరుగుతుంది. వీటివల్ల నిర్వాసితులకూ లాభం జరిగే అవకాశం ఉంటుంది. అంతేగాకుండా రిజర్వాయర్లకు అనుసంధానంగా కాలువలు నిర్మించాల్సి ఉంది. వీటికి కూడా నిధుల కొరత ఉంది.

ఆలయాల అభివృద్ధికి కృషి



లక్ష్మీన్నసింహుడి సన్నిధిలో మైనంపల్లి పూజలు

సిద్దిపేటరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండపై శ్రీ లక్ష్మీనృంహస్వామి దేవస్థానం జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో ఆలయాల అభివృద్ధి మరుగున పడిందని, రేవంత్‌రెడ్డి పాలనలో వేములవాడకు రూ.వంద కోట్లు, మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ ఆలయానికి రూ.35 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. కాకతీయుల కాలంనాటి విశిష్టత కలిగిన దేవస్థానం అయిన లక్ష్మీనృసింహ దేవస్థానాన్ని తప్పకుండా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుల్లూరు కనకయ్య గౌడ్, సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, మెదక్ డీసీసీ అధ్యక్షుడు అంజనేయలు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మంద పాండు, మండల పార్టీ నాయకులు ఉన్నారు.

● వర్గల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి శుక్రవారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రానికి వచ్చిన మైనంపల్లి హన్మంతరావును పార్టీ శ్రేణులతో మర్యాద పూర్వకంగా కలిసారు. స్థానిక ఎన్నికలు, పార్టీ బలోపేతంపై హన్మంతరావు సూచించినట్లు అనిల్‌రెడ్డి తెలిపారు.

ఉచిత ఈసీజీ వైద్య పరీక్షలు



ఆసుపత్రిలో ఉచితంగా ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సిటీ న్యూరో హస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఎలక్ట్రో కార్డియోగ్రామ్ (ఈసీజీ) టెస్ట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 29 నుంచి మొదలైన ఈ స్పెషల్ డ్రైవ్ ఫిబ్రవరి 9వ తేదీ వరకు కొనసాగుతుందని ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ బొగొళ్ల సూచించారు. గుండె జబ్బులకు సంబంధించిన ప్రమాదాలను ముందే తెలుసుకుని జాగ్రత్త పడవచ్చని సూచించారు.

జగదేవ్‌పూర్‌లో పంటల పరిశీలన



దౌలాపూర్‌లో కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగదేవ్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల, దౌలాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో సాగు చేస్తున్న వివిధ పంటలను తోర్నాల డాట్ సెంటర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. శ్రీ విజయ్, డా. పల్లవి శాస్త్రవేత్తలు సందర్శించారు. మొదటగా ఇటిక్యాల గ్రామంలోని 6 ఎకరాల వెదురు సాగు చేస్తున్న కిరణ్, సంతోష్‌రావుల పంటను పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. తర్వాత దౌలాపూర్ గ్రామంలో రైతు సంజీవరెడ్డి ఆయిల్ పామ్ తోటలో అంతరపంట సాగు చేస్తున్న డబ్ల్యూఆర్‌జీ-255 రకం కంది పంటను పరిశీలించారు. చివరిగా గొల్లపల్లి గ్రామంలో రైతు శ్రీనాథ్ సేంద్రియంగా సాగు చేస్తున్న కూరగాయలు ఆకుకూరల పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సమత, ఖలీల్, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకమండళ్లను సన్మానించిన కేటీఆర్



మాజీచైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి దంపతులు, మాజీ చైర్మన్ రాజమౌళిని సన్మానిస్తున్న కేటీఆర్

గజ్వేల్/చేర్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న మునిసిపల్ పాలకమండళ్ల పదవీకాలం ఇటీవల ముగిసిన నేపథ్యంలో చైర్మన్‌లను, ఇతర పాలకవర్గ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా మెమొంటోలు అందజేసి శాలువాలతో సత్కరించారు. సన్మానం పొందిన వారిలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, చేర్యాల మాజీ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి దంపతులు, మాజీ వైస్‌చైర్మన్ నిమ్మరాజీవ్‌రెడ్డి దంపతులు తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పదిమంది పట్టుబడగా వారికి కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో పదిమంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. నిందితులను శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం రూ.15వేలు జరిమానా విధించారు.

లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న జిల్లా జడ్జి



స్వామివారి సన్నిధిలో జిల్లా జడ్జి సాయి రమాదేవి తదితరులు

బెజ్జంకి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని సిద్దిపేట జిల్లా జడ్జి సాయి రమాదేవి శుక్రవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదనాచార్యులు జిల్లా జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జిల్లా జడ్జి తెలిపారు. అనంతరం దేవాదాయ శాఖ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా జడ్జిని ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల చేయూత



బాధితులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం కాగా బాధితుడికి కాంగ్రెస్ నాయకులు అండగా నిలబడి ఆర్థిక సాయం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మిట్టపల్లిలో బాకీ బిక్షపతి లక్ష్మి దంపతులకు చెందిన రేకుల ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ సమాచారమందుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ శుక్రవారం ఘటనాస్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు బాధిత కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకునేలా తహసీల్దార్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఫయాజుద్దీన్, గయాజుద్దీన్, నజ్జు, కవిత, శంకర్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి: టీపీటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతి రెడ్డి

సిద్దిపేట కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలు, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి, రాష్ట్రకార్యదర్శి డి. రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట ఉపాధ్యాయ భవన్‌లో శుక్రవారం టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీస్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అలాగే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీపీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్ బలపరుస్తున్న వై. కుమార్‌ను గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం

● బిస్మాట్ స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారెడ్డి కి సన్మానం

సిద్దిపేట అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు, విద్యారంగ సమస్యలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నూతనంగా తెలంగాణ రాష్ట్రంలో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, బిస్మాట్ సంఘానికి నూతనంగా స్టేట్ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన జగ్గు మల్లారెడ్డిని కొండపాక మండల విద్యాసంస్థల అధినేతలు, హరిత రెస్టారెంట్ వద్ద శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్ ఎమ్మెల్సీగా బరిలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు.

పలు మండలాల్లో గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, జేఏసీ నాయకులు

చేర్యాల/హుస్నాబాద్/గజ్వేల్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి గద్దర్ 77వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పలు మండలాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. చేర్యాలలో జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ తదితరులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు.హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో జయంతి వేడుకల సమావేశాన్ని నిర్వహించారు. గద్దర్ ఒక ఉద్యమ శిఖరమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో ఆర్డినేటర్లు మేకల వీరన్నయాదవ్, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, డేగల సారయ్య, తదితరులున్నారు. గజ్వేల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తరాదు

మద్దూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాబోవు వేసవిలో గ్రామస్థులకు తాగు నీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మిషన్‌భగీరథ డిప్యూటీ ఈఈ కృష్ణ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాంమోహన్ అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీలకు నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈ కృష్ణ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో నీటి సమస్య రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు గ్రామాల వారీగా గుర్తించి తెలియపర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రవళిక, ఇంట్రా దినేజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహాధర్నా పేరిట వంచిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చేర్యాల: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల/ధూళిమిట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత రాజకీయస్వార్థాలకు చేర్యాల ప్రాంతాన్ని విచ్ఛిన్నం చేసి ఇక్కడి ప్రజలకు లేనిపోని కష్టాలు తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని, జేఏసీ ముసుగులో మహాధర్నా పేరిట ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కల్లబొల్లి కబుర్లతో మభ్యపెట్టాలని చూసినా ప్రజలు గుర్తించరని కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్మురవి అన్నారు. శుక్రవారం చేర్యాలలోని స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్మ ఆగంరెడ్డి, పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఏనాడూ ఈ ప్రాంతాభివృద్ధి, ప్రజల సమస్యలపై పట్టనట్లుగా వ్యవహరించారన్నారు. ఇంకా మభ్యపెట్టాలని చూస్తుండటం శోచనీయమన్నారు. కాగా రెవెన్యూ డివిజన్ కోసం బీఆర్ఎస్ నేతలు మహాధర్నా చేపట్టడం హాస్యాస్పదమని మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు చేర్యాలలో విలేకరుల సమావేశంలో విమర్శించారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ పేరుతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కొత్త నాటకానికి తెర తీశాడని మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి విమర్శించారు. పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ధూళిమిట్ట మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

'పల్లా'పై విమర్శలు సరికాదు: బీఆర్ఎస్

చేర్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీవైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చేర్యాల లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిపాలన దృష్ట్యా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు ఏర్పాటు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డివిజన్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాల్సిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పల్లాను విమర్శించడం తగదన్నారు. సమావేశంలో నాయకులు యాట యాదగిరి, బండి సుదర్శనం, ముస్త్యాల బాలనర్సయ్య, కందుకూరి సిద్దిలింగం, పచ్చిమడ్ల సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.